# 4

# దయ

"ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ... స్వప్రయోజనమును విచారించుకొనదు; త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో ఉంచుకొనదు" (1 కొరింథీ. 13:4, 5). లోకమంతా గుర్తించి అభినందించే క్రైస్తవ్యం యొక్క ఒకే గురుతు – దయ. దయలేనివాడు భక్తిగల క్రైస్తవుడనిపించుకోడు. అన్ని పరిస్థితులలో నిజమైన క్రైస్తవుడు దయగలవాడై ఉండాలని ఎదురు చూస్తారు.

"దయ" అనేదానికి వినియోగింపబడిన గ్రీకు పదం – "సేవ చేయదగిన," "మంచి," "ఇంపైన," "కృపగల" మరియు "మర్యాదగల" అనే పదాలుగా తర్జుమా చేయబడింది. "దయాళుత్వము" అనే తెలుగు పదం *philanthropia* అనే గ్రీకు పదంనుండి నేరుగా వస్తుంది. అపొ. 28:2లో ఈ పదం ఉపయోగింపబడింది. అక్కడ పౌలును, అతని సహచరులును ఓడ బ్రద్దలై మాల్టా చేరగా మాల్టావారు వీరికి "అసాధారణమైన దయను" చూపారు. ఇదే పదం తీతు 3లో దేవుని గూర్చి ఉపయోగింపబడింది:

> మన రక్షకుడైన దేవునియొక్క దయయు, మానవులయెడల ఆయనకున్న ప్రేమయు ప్రత్యక్షమైనప్పుడు మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మసంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను (4, 5 వచనాలు).

మానవులపట్ల కనికరంగలవాడిని గురించి ఆలోచిస్తే అతని దయ ఇతరులకు చేరినట్టు తెలుస్తుంది. కేవలం దయగా ఉండడం కంటె ఎక్కువ కార్యాన్ని అతడు చేస్తాడు. దయాళుత్వం గలవాడు పని చేస్తాడు లేక యితరులకు సహాయం చేయడానికి తన సొత్తును యిస్తాడు.

## దయాళుత్వం మరియు దేవుడు

దయాళుత్వం అనేది దేవుని హృదయంలో మనపట్ల ఆయన చేసే కార్యాలలో ఉంటుంది. ఇతరుల యెడల మనం ఎలా మసలుకోవాలో ఆయన స్వభావం మనకు మాదిరిగా ఉంటుంది. ప్రభువైన యేసు యిలా అన్నాడు,

> మీరైతే ఎట్టివారిని గూర్చియైనను నిరాశ చేసికొనక మీ శత్రువులను ప్రేమించుడి, మేలుచేయుడి, అప్పు ఇయ్యుడి; అప్పుడు మీ ఫలము గొప్పదైయుండును. మీరు సర్వోన్నతుని కుమారులై యుందురు. ఆయన, కృతజ్ఞత లేనివారియెడలను దుష్టుల యెడలను ఉపకారియై యున్నాడు. కాబట్టి మీ తండ్రి కనికరముగలవాడై యున్నట్టు

మీరును కనికరముగలవారై యుండుడి (లూకా 6:35, 36).

ఎఫెసీ. 2లో, పరిశుద్ధాత్మచే నడిపింపబడిన పౌలు మనకు రక్షణ తెచ్చిన దేవుని ఆశ్చర్యమైన కృపను గూర్చి వ్రాశాడు. అక్కడ మనయెడల దేవుని దయను గూర్చి నొక్కి చెప్పాడు: "క్రీస్తుయేసునందు ఆయన మనకు చేసిన ఉపకారముల ద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచునిమిత్తము, క్రీస్తుయేసునందు మనలను ఆయనతో కూడ లేపి, ..." (6, 7 వచ.)

అందువలన, దయ అనేది దేవ భక్తికి ప్రాథమిక విషయం. ఎవరు దయకు అపాత్రులో వారికి దయను కనపరపచడంవలన మనం ప్రభువువలె రూపొందుతాం. ఇతరులు మనపట్ల క్రూరంగానుండి అమర్యాదగా ప్రవర్తించినప్పుడు మన దయ పరీక్షింప బడుతుంది. వారి యెడల మనమింకను దయను చూపించగలమా? దయ చూపేవారికి మర్యాదస్థులకు దయ చూపడం సులభమే! అయోగ్యులకు దయ చూపడం ఒక సవాలు.

## దయాళుత్వం మరియు ప్రేమ

క్రైస్తవులుగా ప్రేమ లేకుండ మనం చేసింది ఏదీ దేవునిచే అంగీకరింపబడదు. బహు వివేకమైన ప్రసంగం ప్రేమ లేనిదైతే మోగే కంచును గణగణలాడు తాళంగా ఉంటుంది. మర్మమంతయు జ్ఞానమంతయు ఎరిగిన మహా గొప్ప ప్రసంగం ప్రేమ లేనప్పుడు నిష్ప్రయోజనమైయుంటుంది. ఒకనికి కొండలను పెకిలించగల విశ్వాసమున్నా, ప్రేమ లేకుంటే దానికి విలువే లేదు. పేదల పోషణకొరకు తనకున్న సమస్తాన్ని యిచ్చివేసినా, ప్రేమ లేకుండ అలా చేసినట్టయితే అది అతనికి వ్యర్థమే.

ప్రేమ క్రైస్తవ్యానికి హృదయం వంటిది, మరియు దయాళుత్వం అనేది దాని ప్రాథమిక లక్షణాల్లో ఒకటి. "ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" అని పౌలు వ్రాసినప్పుడు మనం ఆశ్చర్యపడనవసరం లేదు (ఎఫెసీ. 4:32).

## దయను పెంపొందించుకొనడం

దయాళుత్వం అనేది అంత ప్రాముఖ్యమైనదైనట్టయితే, మన దైనిక జీవితాల్లో దానిని పెంపొందించుకొనడం ఎలా? మొదటిగా, అది ఆత్మఫలములలో ఒకటై ఉంది (గలతీ. 5:22, 23). గనుక, మనం ఎక్కువ ఆత్మ సంబంధులుగా రూపొందడం వలనను, దేవుని ఆత్మ మన జీవితాలను అధికంగా వశపరచుకొననివ్వడంవలనను దయ పెంపారుతుంది. మనం ఆత్మయందు జీవించుతూ, ఆత్మచేత నడిపింపబడి నవారమైతే, యితరులతో మన సంబంధాలలో దయగా ఉంటాం. ఆత్మ మనలను వశపరచుకునేదానిలో భాగంగా లేక మన జీవితాలను ఏలుబడి చేసే భాగంగా బైబిలులో ఆయన ఉపదేశాన్ని మనం పఠించుతూ నేర్చుకున్న ప్రకారం జీవించడానికి ప్రయాసపడాలి.

దయను నేర్చుకోవచ్చు కూడా. వృద్ధ స్త్రీలు యౌవన స్త్రీలకు ఉపదేశం చేయ వలసిందిగా తీతు 2:3–5లో పౌలు హెచ్చరించాడు:

> ఆలాగుననే వృద్ధస్త్రీలు కొండెకత్తెలును, మిగుల మద్యపానాసక్తులునై యుండక, ప్రవర్తనయందు భయభక్తులుగలవారై యుండవలెననియు, దేవుని వాక్యము దూషింపబడకుండునట్లు, యౌవనస్త్రీలు తమ భర్తలకు లోబడియుండి తమ భర్తలను శిశువులను ప్రేమించువారును స్వస్థబుద్ధిగలవారును పవిత్రులును ఇంట ఉండి పని చేసికొనువారును మంచివారునై యుండవలెనని బుద్ధి చెప్పుచు, మంచి ఉపదేశము చేయువారునై యుండవలెననియు బోధించుము.

దయకలిగి యుండాలంటే వారు ఉపదేశం పొందాలి. ఈలాటి ఉపదేశము మాట చేతను, మాదిరిచేతను రావలసియుంటుంది. ఇతరులను దయగా చూడడం అనేది వృద్ధులు ప్రదర్శించాలి. ప్రత్యేకించి వారు ఎవరిని ఆకర్షించాలని కోరుకుంటారో వారి యెదుట దీనిని ప్రదర్శించాలి. దానితోపాటు, యితరులతో మనకుండే సంబంధంలో, దయ ముఖ్యమైనదని ఉపదేశించాలి.

మన అనుదిన జీవితంలో, మెలకువగా దానిని ఆచరణలో పెట్టడంవలన దయను మనం పెంచుకోవచ్చు. కొలస్సీ. 3:12 యిలా అంటుంది: “కాగా, దేవునిచేత ఏర్పరచబడిన వారును పరిశుద్ధులును ప్రియులునైనవారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి. ... ఒకనినొకడు క్షమించుడి.” ఇతరులతో దయగా వ్యవహరించడం సహజంగా రాదు. దయ మన గుణగణాలలో ఒకటిగా ఉండునట్లు మనం పని చేయాలి.

## దయను వర్తింపజేయుట

దయ అనే ఈ సూత్రాన్ని మన జీవితాల్లో ఎలా వర్తింపజేస్తాం? అది మన యింటిలో ప్రారంభించాలి. అనుదినం మనతో ఉన్నవారికే దయను చూపలేకపోయినట్టయితే, వేరే స్థలంలో దయను చూపాలని ప్రయత్నించడం అవివేకం. భార్య భర్తల బాధ్యతలను గూర్చి చర్చించిన తరువాత, పేతురు యిలా అన్నాడు,

> తుదకు మీరందరు ఏకమనస్కులై యొకరి సుఖదుఃఖములయందు ఒకరు పాలుపడి, సహోదరప్రేమ గలవారును, కరుణాచిత్తులును, వినయమనస్కులునై యుండుడి. ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి గనుక కీడుకు ప్రతికీడైనను దూషణకు ప్రతి దూషణయైనను చేయక దీవించుడి (1 పేతురు 3:8, 9).

కుటుంబంలో ఉండే ఐకమత్యము లేక పొందిక ఒకరిపట్ల ఒకరు కనపరచు కరుణా చిత్తంతో ముడివేయబడింది. చాల తరచుగా, మన జీవితాలను ఎవరికి అప్పగించుకున్నామో, ఎవరు మనకు వారి జీవితాన్ని సమర్పించుకున్నారో వారికంటె ఎక్కువగా పరులకు

దయను, మర్యాదను చూపుతాం. మన చుట్టు ఉన్నవారిని మనం ఎలా చూస్తామో మన పిల్లలు దానిని గమనిస్తారు. వారితో మనం దయగా వ్యవహరించకపోతే, యితరులతో దయగా ఉండాలన్న విషయం వారు ఎప్పుడైనా నేర్చుకోగలరా?

తరువాత, తోటి క్రైస్తవులతో మనకుండే సహవాస సంబంధాలలో దయ తాండవించాలి. సంఘంలో ఒకరితో ఒకరు దయ లేకుండ ఉంటూ క్రీస్తు స్వభావం మనలో ఉందని చెప్పుకోలేం. అందులో ప్రత్యేకించి భిన్నాభిప్రాయాలు పైకి వచ్చినప్పుడు దయ కన్పించాలి.

మనం పని చేసే స్థలాల్లో కూడా మనం దయకలిగి ఉండాలి. అక్కడ మనం దయను ప్రదర్శించినట్లయితే, మనలో ఈ ప్రత్యేకతకు కారణమేమిటా అని మన ప్రభావం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మనం నీచ స్వభావం కలిగినవారమై యితరుల పట్ల నిర్దయులమై ఉన్నట్టయితే, ప్రభువైన యేసు మన జీవితాల మీద ప్రభావమును కనుపరచినట్టు వారు తలంచరు. ఇతరులు మనకు నిర్దయులుగా ఉన్నను మన దయను మనం కోల్పోకూడదు. క్లిష్ట పరిస్థితులలో మన దయ నిలకడగా ఉండాలి.

మన వ్యవహారాలన్నిటికి దయను వర్తింపజేయాలి, లేకుంటే దేనిలోనూ ప్రయోజనం ఉండదు.